# ఒంటరితనం

పురోహితుడు చెపుతున్న మంత్రాలను తదేకంగా వింటున్నట్టు నటిస్తూనే మధ్య మధ్య ఓరగా పెళ్ళి కూతురి వైపు చూస్తూ చిలిపి నవ్వులు చిందిస్తున్నాడు పెళ్ళి కొడుకు. వధువు కంటి కొసల నుంచి అది గమనిస్తూ సిగ్గుపడుతూనే ముసి ముసిగా నవ్వుకుంటోంది.

ఆ వివాహ తంతుని ముచ్చటగా చూస్తున్న ఆనందరావు హఠాత్తుగా కళ్యాణ మంటపంలో కొచ్చి పురోహితుడి చెవిలో ఏదో చెప్పేసి వెళుతున్న స్త్రీ మూర్తిని చూసి ఉలిక్కిపడ్డాడు.

"ఆమె... ఆమె రాజ్యలక్ష్మి కదూ!" ఒక్కసారిగా గుండె గొంతులో కొచ్చిన అనుభూతి.

వయసులో ఎంత అందంగా వుండేదో ఇపుడంత హుందాగా వుంది.

"రాజీ!" అతను మనసులోనే అయినా ఎంత ఆర్తిగా పిలిచాడో కానీ చటుక్కున అప్పుడే తలతిప్పి ఇటు చూసింది రాజ్యలక్ష్మి.

"మీరా!" అన్నట్లు ఆమె కళ్ళలోను ఒక్క క్షణం సంభ్రమాశ్చర్యాలు. అప్రయత్నంగానే ఒక్కడుగు యిటు వేసిందేమో కూడా. కానీ అంతలోనే మామూలుగా అయిపోతూ, తనను తాను సర్దుకుంటూ నెమ్మదిగా వెళ్ళి ఓ స్తంభం చాటుగా వున్న కుర్చీలో కూర్చుండి పోయింది.

ఆనందరావు చూపులు ఆమె వెన్నంటే వెళ్ళాయి.

ఇంతలో ఓ అమ్మాయి హడావుడిగా ఆమె వెనుకే వెళ్ళి ఏదో అడిగింది. దానికామె ఏదో చిన్నగా చెప్పింది. ఆ అమ్మాయి వెళ్ళిపోయింది.

రాజ్యలక్ష్మి మళ్ళీ ఇటు తనవైపు చూస్తుందేమోనని కొద్దిసేపు అటే చూస్తూ ఎదురు చూశాడు ఆనందరావు.

కానీ ఆమె ఇటు తిరగనే లేదు. ఆనందరావుకిక కూర్చున్న కుర్చీలో కూర్చోబుద్ధి కాలేదు. సందేహిస్తున్న మనసును సమాధానపరుస్తూనే లేచి ఆమె వైపు నడిచాడు. తన కతి సమీపంగా వచ్చి నిలుచున్న అతన్ని చూడగానే ఆమె గబుక్కున లేచి నుంచుంది.

"కూర్చో! రాజ్యలక్ష్మి" ఆమె పక్కనే వున్న కుర్చీలో కూచుంటూ అన్నాడు ఆనందరావు.

తమ నెవరైనా గమనిస్తున్నారేమో అన్నట్టు ఆమె తత్తరపడింది. అంతా పెళ్ళి హడావుడిలో వున్నారు కానీ ఈ మూలకు ఎవరూ చూడడం లేదనుకున్నాక కాస్త సర్దుకుంది.

"బావున్నావా?"

అతని ప్రశ్నకు ఆమె చివుక్కున తలెత్తి సూటిగా చూసిందో క్షణం. "ఎంత బాగా అడుగుతున్నారా మాట?" అని నిలదీస్తున్న ట్లుందా చూపు. తడబడ్డాడా చూపుకి.

ఉన్నట్లుండి భజంత్రీలు తారాస్థాయినందుకున్నాయి. మాంగల్యధారణ జరుగుతూంది కాబోలు. అందరూ అంతవరకు తమ తమ చేతుల్లో వుంచుకున్న అక్షింతలు వధూవరులపై చల్లుతున్నారు.

రాజ్యలక్ష్మి మౌనంగా అటే చూడసాగింది.

ఆనందరావు కనులు అప్రయత్నంగా అటే మళ్ళాయి.

"దాదాపు ముప్పయ్యేళ్ళ క్రితం ఇలాగే పచ్చని పందిట్లో పదుగురు దీవిస్తూ అక్షింతలు చల్లుతుండగా తను ఈమె మెడలో మాంగల్యం కట్టాడు. జీవితాంతం ఒకరి కొకరు తోడుగా వుండాలని ఆమెతో కలసి ఏడడుగులు నడచిన తాను ఆ పెళ్ళి తెగతెంపులు చేసుకొని మరో స్త్రీ మెడలో తాళి కట్టాడు.

ఈమె మాత్రం... ఇలాగే ఒంటరిగా మిగిలి పోయిందని తాను విన్నాడు. విడాకులు తీసుకున్నాక ఇన్నేళ్ళలోనూ ఈమెను కలుసుకోనే లేదు. ఇప్పుడీ పెళ్ళిలో ఇలా చూడడం..." ఆనందరావు మనసులో ఎన్నో భావాలు.

పెళ్ళికి వచ్చిన బంధువులందర్నీ తన కెమెరాలో బంధించుకుంటూ తిరుగుతూంది వీడియో. ఫ్లాష్ తమ మీదకు రాగానే ముఖం కనిపించకుండా పక్కకు తిరిగిందామె బిడియంగా. అది గమనించి "ఈమె ఎందుకిలా ప్రవర్తిస్తుంది తన సమక్షంలో ఎవరో పరాయివాడి పక్కన వున్నట్లు?" అనుకున్నాడు. కానీ వెంటనే లోన ఎవరో చెళ్ళున కొట్టినట్లనిపించింది.

"పరాయివాడు కాక ఈ రోజు తనేమవుతాడు ఈమెకి?"

మళ్ళీ తనకు తానే సమాధానమిచ్చుకున్నాడు. "విడాకులు తీసుకున్నంత మాత్రాన అయిదేళ్ళ ఈమెతో తను వివాహ జీవితం గడపలేదా? ఈమె మరెవరినైనా పెళ్ళి చేసుకుని వున్నా తనకేమీ కాకపోనేమో కానీ అదో ఆ సన్నని జరీ చీర వెనుక ఎదపై మెరిసే ఆ మంగళసూత్రాలు తను కట్టినవేగా? ఆ పెళ్ళి పూర్తిగా రద్దయిపోయినట్లే అనుకుంటే అవి మెడలోంచి తీసేయలేదేం? ఈమె నెవరైనా మీ భర్త పేరేమిటి? అని అడిగితే తన పేరేగా చెప్పాలి!".

అంతరాత్మ ఎగతాళిగా నవ్వింది. "మరి అదే ప్రశ్న 'మీ భార్య పేరేమిటి?' అని నిన్నడిగితే నువ్వేం చెపుతావు?"

తప్పుచేసినవాడిలా తలవంచుకున్నాడు ఆనందరావు. తనలో తను అంతర్ముఖుడైనట్లు వుండిపోయిన ఆనందరావును ఓ నిముషం నిశితంగా చూసింది రాజ్యలక్ష్మి.

తల చాలా వరకు తెల్లబడిపోయింది. కొత్తగా చేరిన కళ్ళజోడు ముఖానికి గంభీరతనిస్తూంది.

"ఇతను తన కర్మానికి తనను వదిలేసి మరో పెళ్ళి చేసుకున్నా ఇన్నేళ్ళ తర్వాత చూడగానే లేచి తన దగ్గరకొచ్చి'బావున్నావా?'అని పలకరించాడు. తానూ రెండు మాటలు మాట్లాడితే ఏం? ఇప్పుడిక ఈయన్ని సాధించి చేసేదేముంది?" అలా అనుకున్నాక చిన్నగా అడిగింది.

"మీ పిల్లలు బాగున్నారా?" ఒక అమ్మాయి, అబ్బాయి అని విన్నది రాజ్యలక్ష్మి ఎప్పుడో.

"ఆ! అబ్బాయి పెళ్ళి చేసుకుని స్టేట్స్ వెళ్ళిపోయాడు. అక్కడే సెటిలయినట్లే. అమ్మాయికీ పెళ్ళయింది. ఢిల్లీలో వుంటోంది."

"ఆవిడ... రాలేదా పెళ్ళికి?"

"ఆమె చనిపోయి మూడేళ్ళవుతూంది"

నిశ్శబ్దంగా వుండిపోయింది రాజ్యలక్ష్మి ఆ జవాబుతో.

'ఓహో, ఆమె చనిపోయింది. అందుకే ఇతను ఇంత ధైర్యంగా, ఉదారంగా పనిగట్టుకుని తన

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

అద్దేపల్లి సుచిత్రాదేవి

దగ్గరకొచ్చి పలకరిస్తున్నాడు కాబోలు. అదే ఆమె ఇప్పుడు ఇతని పక్కనుంటే ఈ మహాశయుడు ఇలాగే వచ్చి తన దగ్గర కూచుని ఇంత ఆప్యాయంగా మాట్లాడేవాడా? ఎంతైనా మొగవాడు మొగవాడే. ఆశావాది, అవకాశవాది. ఆశలు ఆడ వారికీ వుంటాయి కానీ వాటికెన్నో ఆంక్షలు. అవకాశాలు స్త్రీలకూ వస్తాయి కానీ వాటికెన్నో అభ్యంతరాలు. అయిదేళ్ళు తనతో కాపురం చేసిన ఈ మహానుభావుడు తనకు పిల్లలు పుట్టరని డాక్టర్ పరీక్షలో తేలగానే తల్లి చెప్పిందనీ, వంశం కోసమనీ తనతో తెగతెంపులుచేసుకుని మరో పెళ్ళి చేసుకున్నాడు. ఇప్పుడు ఆ వంశోద్ధారకులు ఎవరి దారి వాళ్ళు చూసుకున్నారు. మధ్యలో వచ్చినామె మధ్యలోనే వెళ్ళిపోయింది. ఒంటరిగా మిగిలిపోయి ఎంతైనా పాత పెళ్ళామే కదా అని వచ్చి తనతో మాటలు కలిపాడేమో. ఛీ అతను మాట్లాడ్తే మాట్లాడాడు తన సిగ్గేమయింది?'


రెండో భార్య లేదు కాబట్టే తనతో మాట్లాడాడు అన్న తలపు రాగానే రాజ్యలక్ష్మి లోని స్త్రీత్వం గాయపడింది. అతని ముందు నుంచి వెళ్ళిపోవాలని అనుకుంటున్నంతలో దేముడే పంపినట్లు ఇందాక పలకరించిన అమ్మాయే వచ్చి "ఆంటీ, మీరు ఇంకా ఇక్కడే వున్నారా, అక్కడ పిలుస్తున్నారు" అని చెప్పింది.

"నేను వెళతాను. పనుంది" గబుక్కున లేచి ఆనందరావు సమాధానం కోసం కూడా చూడకుండా ఆ అమ్మాయితో వెళ్ళిపోయింది రాజ్యలక్ష్మి.

తనతో ప్రసన్నంగానే మాట్లాడుతున్నదల్లా హఠాత్తుగా అలా ముభావంగా మారిపోయి అర్థాంతరంగా వెళ్ళిపోవడం ఏదో వెలితిగా అనిపించింది ఆనందరావుకి.

పెళ్ళి మంటపం వైపు చూసాడు. వివాహం అయిపోయింది.

వధూవరులను అక్కడ్నుంచి తీసుకెళ్ళిపోయారులా వుంది. అక్కడంతా ఖాళీగా వుంది. పట్టు పరికిణీలు వేసుకున్న ఇద్దరు చిన్న పాపలు అలంకారానికి కట్టిన పూల తోరణాల మధ్య కిలకిలనవ్వులతో దోబూచులాడుకుంటున్నారు. రాజ్యలక్ష్మి ఎక్కడైనా కనిపిస్తుందేమోనని వెదుక సాగేయి ఆనందరావు కళ్ళు. అయితే ఆ తర్వాత



# వంగరైనా వంగాల్సిందే!



'కలెక్టరు జానకి' సినిమాలో కలెక్టరుకి పి.ఎ.గా నటించి, మంచి పేరు తెచ్చుకుని, ఇంత వరకూ రెండు మూడు వందల చిత్రాల్లో ఆర్టిస్టుగానూ, డబ్బింగ్ ఆర్టిస్టుగానూ పనిజేసి, హుందా అయిన పాత్రలకి తనకు తానే సాటి అనిపించుకున్న, సినీ రంగస్థల నటుడు శ్రీ పి.జె. శర్మగారు ఈ మధ్యన కలిసినప్పుడు చెప్పిన ఉదంతం.

సినిమాల్లో 'వంగర'గా తెలిసిన శ్రీ వంగర వెంకట సుబ్బయ్య ఓ మారు షూటింగ్‌లో పాల్గొనడానికి ఓ పల్లెటూరు వెళ్ళారట. పల్లెల్లో ఏవిటి, పట్నాల్లో ఏవిటి, సినీ ఆర్టిస్టులు కనిపించగానే జనం ఉత్సాహంతో కేకలు పెడతారుగా, 'అడుగో ఎన్టీఆర్', 'అడుగో గుమ్మడి' అంటూ.

అలాగే ఆయన్ని చూడగానే 'వంగర అడుగో, వంగర అడుగో' అని అరిచారట. ఒక పెద్దాయనకి మాత్రం అనుమానం వచ్చిందట. ఇంతకీ ఈయన వంగర అవునా కాదా అని. అనుమానం తేల్చుకుని వస్తాను వుండండి అని చెప్పి, వంగరని సమీపించి "మీరు వంగరా?" అని సీరియస్‌గా అడిగారట. వంగర తెల్లబోయి, వెంటనే సర్దుకుని, సౌమ్యంగా "ఎందుకు వంగను? మీలాగ వయస్సు వచ్చాక నేనూ వంగుతాను" అన్నారట. వంగర చమత్కారానికి ఆ పెద్దాయనతో బాటు అంతా పకపకా నవ్వారు.

—పోలాప్రగడ

ఆమె కనిపించనే లేదు. ఆమె కోసం తానింతగా ఆరాటపడడం తలచుకుంటుంటే ఓ వంక అతనికే ఆశ్చర్యంగా వుంది. కొన్నేళ్ళ క్రితం తానామెను బలవంతంగా తన జీవితంలోంచి నెట్టివేశాడు. ఇప్పుడు మళ్ళీ ఆమె సన్నిధి కోరుకుంటుందేం మనసు?

ఎవరికోసమో వెదుకుతున్నట్టు చూస్తున్న ఆయన్ని చూసి దూరపు బంధువొకాయ అడిగాడు.

"ఎవరి కోసం చూస్తున్నారు?"

"మా ఆవిడ కోసమే!" అయితే మనసులోని ఆ మాట ధైర్యంగా పెదవి దాటి రాలేక పోయింది.

చివరికి వికలమైన మనస్సుతో పెళ్ళివారింటి నుంచి భోంచేయకుండానే యింటికి వెళ్ళిపోయాడు.

అది జరిగిన ఆరు నెలల తర్వాత ఓ రోజు రాజ్యలక్ష్మిని వెదుక్కుంటూ ఓ ఉత్తరం వచ్చింది ఆనందరావు దగ్గర్నుంచి. తాను జబ్బుతో మంచంలో వున్నాననీ, ఒక్కసారి వచ్చి కనిపించి వెళ్ళమనీ. అతనికి ఆరోగ్యం సరిగా లేదని తెలిసిన తర్వాత వెళ్ళకుండా వుండలేక పోయింది రాజ్యలక్ష్మి.

ఆర్నెల్ల క్రితం ఆ పెళ్ళిలో చూసిన వ్యక్తికీ యిప్పుడున్న మనిషికీ కనిపిస్తున్న తేడా చూసి ఆశ్చర్యపోయిందామె. ఒక్కసారిగా మరో పదేళ్ళు పైబడ్డట్టు వున్నాడు ఆనందరావు.

రాజ్యలక్ష్మిని చూడగానే అన్నాడు "నా మాట మన్నించి వచ్చావు. నీతో చెప్పవలసిన నాలుగు మాటలు చెప్పకుండానే పోతానేమోనని భయపడ్డాను."

తన రాక అతనికెంత ఆనందాన్నిచ్చిందో తననుచూడగానే ఒక్కసారిగా ఆ కళ్ళల్లో కొచ్చిన మెరుపును చూసే అర్థం చేసుకుందామె.

"ఏమిటిలా అయిపోయ్యారు?" అడిగింది.

నీరసంగా నవ్వేడు ఆనందరావు. అంత యింటిలో వంటవాడు, పనిమనిషి తప్ప మరో మనిషి అలికిడి లేకపోవటం గమనించి అడిగిందామె. "అబ్బాయికీ, అమ్మాయికీ టెలిగ్రాములివ్వలేక పోయారా?"

"ఇప్పుడేమయిందని! చీటికి మాటికి రావడానికి అబ్బాయి ఏమన్నా పక్కనున్నాడా, ఇక అమ్మాయి మాత్రం అన్నప్పుడల్లా ఎలా వస్తుంది? అల్లుడికీ, పిల్లలకూ ఇబ్బంది కదా తనిక్కడికి వస్తే."

"నా అనారోగ్యం ఓసారి వచ్చి చూస్తే పోయేది కాదు. ఊరూరికి వాళ్ళను డిస్టర్బ్ చేయడం ఎందుకు? పోయానని తెలిస్తే ఎటూ రావాలి కదా."

"ఛ, అవేం మాటలు? అశుభం ఎందుకు తలవటం" అన్నదామె. కొద్దిసేపు నిశ్శబ్దంగా వున్నతను చిన్నగా అడగలేక అడుగుతున్నట్లు అడిగాడు. "నువ్వు...నువ్వింకా నన్ను నీ భర్తగానే భావిస్తున్నావా?"

రాజ్యలక్ష్మి ఏమీ మాట్లాడలేదు.

మళ్ళీ ఆనందరావే అన్నాడు "నేనసలు ఆ మాట అడిగే అధికారాన్నే పోగొట్టుకున్నాను కదూ. నీకు చాలా అన్యాయం చేసాను రాజ్యలక్ష్మీ! నీకిక సంతాన యోగ్యత లేదని తెలుసుకుని నువ్వు కుమిలిపోతుంటే 'పిల్లలు లేకపోతే ఏం నేనున్నానుకదా నీకు తోడు' అని ఓదార్చవలసిన భర్తను దాంపత్య సౌభాగ్యాన్ని కూడా దూరం చేయటాన్ని నువ్వే కాదు బహుశా ఏ స్త్రీ కూడా క్షమించదు.

పిల్లలంటే పిచ్చి ప్రేమ, అమ్మ వత్తిడి యివన్నీ అప్పట్లో నీ వైపున ఆలోచించే అవకాశమే యివ్వలేదు. ఇపుడు తెలుస్తోంది నేనెంత అవివేకంగా ప్రవర్తించానో. సంతానం ఎవరికైనా అవసరమే. కానీ ఆ సంతానం కోసమనే జీవిత భాగస్వామిని కాదనుకోకూడదు. రెక్కలొచ్చే వరకే పిల్లలు. రెక్కలు రాగానే వాళ్ళెగిరిపోయి తమ స్వంత గూడు నిర్మించుకుంటారు. ఇక యీ గూటిలో ఒకరి కొకరు తోడుగా వుండాల్సింది ఆలుమగలే. వయసులో వున్నప్పటికన్నా వయసైన తర్వాతే ఆలుమగలకి ఒకరి విలువ మరొకరికి తెలుస్తుందేమో. అప్పుడా తోడు మానసికంగా ఎంతో అవసరం!" అతనేదో కలలోలా మాట్లాడుకుపోతున్నాడు. ఆమె వారించలేదు. మనసులోని మాటలు చెప్పుకునేందుకు మనిషే కరువైన వాడిలా మాట్లాడుతున్నాడు. అది తెలుస్తూనే వుందామెకు. ఓ క్షణం ఆగి అన్నాడతను. "నేనీ మాటలన్నీ నా రెండో భార్య యిప్పుడు లేదుకదా అని ఆ వెలితితో నిన్ను పిలిచి నీకు చెపుతున్నానని నువ్వు అనుకోవద్దు. ఆమె వున్నా కూడా చనిపోయేలోపల నీతో ఓసారి మాట్లాడి నిన్ను మన్నించమని అడగాలన్న కోరిక నాలో ఎప్పట్నించో వుంది. మనం విడిపోయినందుకు నేను నిన్ను కోల్పోయానేమోకాని మళ్ళీ నాకంటూ ఓ సంసారం ఏర్పడింది. మరి నీవో...నువ్వు ఒంటరిగానే మిగిలిపోయావు. కనీసం నీవూ మరో పెళ్ళిచేసుకుని వుంటే యీనాడు నాకింత బాధ వుండేది కాదేమో" కొద్దిసేపుండి అతనే అన్నాడు.

"అవును. అప్పుడు బహుశా మీకిలా నాతో మాట్లాడే అవకాశమూ వుండి వుండేది కాదు."

"అంటే?"

"అంతే. మీరిలా రమ్మనగానే నేను వచ్చేదాన్నా? మా వారు ఏమన్నా అనుకోగలరని రాకపోయేదాన్ని కదా!" వాతావరణాన్ని తేలిక

కోరమాండల్ సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్

చేస్తూ నవ్వేసిందామె.

ఆనందరావు నవ్వేసాడు "నిజమే సుమా!" అంటూ అలా నవ్వుతుంటే తానింత హాయిగా నవ్వి చాలా రోజులయిందని గుర్తొచ్చిందతనికి.

ఆనందరావుని పరీక్షించేందుకు వచ్చిన డాక్టర్ వెనుకే వెళుతూ అడిగింది రాజ్యలక్ష్మి.

"ఏమిటసలు యీయన అనారోగ్యం?"

"వయసుతోపాటు వచ్చిన బి.పి., షుగర్ కంప్లయింటు అన్నింటినీ మించి మానసికంగా దిగులు."

"దిగులా? దేనికి?"

"ఒంటరితనంవల్ల. ఈ వయసులో ఒంటరిగా వుండాల్సి రావటంతో రోజంతా ఏమీ తోచక ఏదో ఆలోచిస్తూ లేనిపోని అనారోగ్యాలు తెచ్చుకుంటుంటారు."

"మీరు ఫేమిలీ డాక్టరు నంటున్నారు. ఆయనకి సలహా యివ్వలేక పోయారా? ఒంటరిగా ఎందుకుండటం? కూతురి దగ్గరకో; కొడుకు దగ్గరకో పోవచ్చుకదా?"

"కూతురింటికి పోవాలంటే అభిమానం. కొడుకు పిలవనిదే ఎలా వెళ్ళటమన్న ఆత్మాభిమానం. అవునూ నేను మిమ్మల్నెప్పుడూ చూడలేదు. యింతకీ మీరేమవుతారు యీయనకి?" డాక్టర్ కుతూహలంగా అడిగాడు. దానికేమీ చెప్పకుండానే పేషంటు కివ్వాల్సిన ఆహారం గురించి అడిగిందామె.

మరునాడు పొద్దున ఆనందరావు నిద్రలేచేసరికి లోపల్నుంచి మాటలు వినిపిస్తున్నాయి.

"నీ పేరేమిటన్నావు?" రాజ్యలక్ష్మి అడుగుతుంది.

"నారాయణ అండీ!" వంటతను నమ్రతగా చెపుతున్నాడు.

నారాయణ అదీ యిదీ మాట్లాడుతుంటే వూకొడుతూందామె చిన్నగా. ఎప్పుడూ స్తబ్దంగా వుండే ఆ యింట్లోకి సంతోషమనే సవ్వడి వచ్చి చేరినట్లుంది ఆనందరావుకి. ఆమె ఎప్పుడూ యిక్కడే వుంటే అన్న ఆలోచన కలిగింది. తన ఆలోచనకు తనే నవ్వుకున్నాడు.

"ఆమెందుకు వుంటుంది? స్త్రీలో క్షమాగుణం అధికం కావచ్చేమో కానీ ఆత్మాభిమానమూ అధికమే. పాత కోపం మనసులో పెట్టుకోక పిలిచాను కదాని ఏదో ఓసారి చూసి పోదామని దయతలచి వచ్చింది. అంతే!"

అయితే ఆమె సమక్షంలో విశ్రాంతిని అనుభవిస్తున్న మనసులో ఆశ వదలలేదు.

మరి కొద్దిసేపటికి హార్లిక్స్ గ్లాసుతో అతని దగ్గరకొచ్చింది రాజ్యలక్ష్మి. ఆనందరావు గ్లాసు అందుకుని పక్కన పెడుతూ అన్నాడు "రాజ్యలక్ష్మీ, విన్నటి నుంచి నాకెంతో ప్రశాంతంగా, ధైర్యంగా వుంది. జీవితం చివరి అంచులో నడుస్తున్న వాడిని. ఇక యీ ప్రశాంతత పోగొట్టుకుని నేను బతకలేను. మిగిలిన ఆ నాలుగడుగులూ వేసేందుకు నాకు తోడు కావాలి. ఇలా యిప్పుడు నిన్నడగడం ఎంతవరకు న్యాయమో, అన్యాయమో కూడా ఆలోచించే స్థితిలో లేదు నా మనసు. నువ్వు...యిక్కడే వుండిపోకూడదూ?"

ఆమె నవ్వింది పలుచగా. "నేను యీపూట వెళ్ళిపోతున్నాను అని చెప్పడానికొచ్చాను" అంది.

అతని ముఖం ఒక్కసారిగా పాలిపోయింది. ఇందాక ప్రాధేయపడుతూ చూసిన కళ్ళలో రెపరెపలాడుతున్న జీవకళ కాస్తా విస్తేజంగా అయినట్లయింది.

"మీరు మీ జీవితంలోంచి నన్ను వద్దన్నాక నేను నాదైన జీవితం ఒకటి ఏర్పరచుకున్నాను.

'మనం విడిపోగానే నాకు మరో సంసారం ఏర్పడింది. నువ్వు మాత్రం ఒకటిరిగానే మిగిలిపోయావు' అన్నారు మీరు. లేదు. నేను ఒంటరిగా మిగిలిపోలేదు. ఒంటరితనంతో జీవన సంధ్యలో ఓ ఆధారం లేక కుమిలిపోతున్న వృద్ధులందరూ నా వారే అయ్యారు. పాతికేళ్ళ క్రితం నేను ప్రారంభించిన సేవాశ్రమంలో యీ రోజు వందల మంది వృద్ధులు తమ కుటుంబ సభ్యులకు భారమైన వారూ, ఎవరూ లేని వారూ, యిప్పటి జనరేషన్‌లో కలవలేక పోయినవారు తమ జీవితంలోని చివరి రోజులను విశ్రాంతిగా వెళ్ళబుచ్చుతున్నారు" చెపుతున్న ఆమె ఒక్క క్షణం ఆగింది.

"మీరు ఒంటరితనంతో వుండలేమనుకుంటే మీకభ్యంతరం లేకపోతే వచ్చి మా ఆశ్రమంలో చేరవచ్చు."

ఆనందరావు మనస్సు చివుక్కుమంది. అయితే వెంటనే సర్దుకున్నాడు కానీ ఏమీ మాట్లాడలేక పోయాడు.

అతను కామ్‌గా వుండిపోవటం చూసి రాజ్యలక్ష్మి అన్నది.

"మీరు బాగా ఆలోచించుకుని మీ నిర్ణయాన్ని తెలపండి" ఆమె వెళ్ళిపోయింది అక్కడ్నుంచి.

"ఒకనాటి తానామెకు చేసిన అన్యాయానికి పరిహారంగా అన్నట్లు ఆమెను తనతోనే వుండమన్నాడు. ఆమెను ఏకాకిగా చేసానని జాలిపడ్డాడు కానీ నిజానికి తానే ఒంటరి పక్షిలా మిగిలిపోయాడు! ఇప్పుడామె గూటిలోనే తనను తలదాచుకోను రమ్మంటోంది.

రమా!...ఎంత ఎదిగిపోయింది!

ఎందుకోగానీ అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

## చెప్పు సంగతి చెప్పు

ప్రముఖ సినీ, రంగస్థల నటుడు శ్రీ పి.జె. శర్మ, ప్రసిద్ధ కవి, విమర్శకుడు ఆరుద్ర, మహాకవి శ్రీశ్రీ, వీరు ముగ్గురూ సమీప బంధువులూ, ఒకరి కొకరు అతి సన్నిహితులూ కూడా. మొన్నీ మధ్య కబుర్లలో శ్రీశ్రీకి సంబంధించిన ఒక ఆసక్తికరమైన సంగతి చెప్పారు శ్రీ శర్మ.

పాతిక ముప్పయి యేళ్ళ క్రితం సంగతి.

మంచి నడి ఎండలో, మద్రాసు పాండీ బజారులో కాళ్ళకి చెప్పులు లేకుండా గబగబా నడిచి వెళుతున్నారు శ్రీశ్రీ. ఎదురుగుండా పేరడీ కింగ్ శ్రీ జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి ఎదురు వచ్చారు. పలకరింపులూ, కుశల ప్రశ్నలూ అయ్యాయి. కాలుతూన్న కాళ్ళని మాటిమాటికీ మారుస్తూ అస్థిమితంగా వున్నారు శ్రీశ్రీ. ఏవిటిది? అనుకొని కాళ్ళకేసి చూశారు జలసూత్రం. శ్రీశ్రీ కాళ్ళకి చెప్పులు లేవు.



చాలా నొచ్చుకొని "ఏవిటిది శ్రీనివాసరావుగారూ! ఏవైనా ఇబ్బందుల్లో వున్నారా? లేకపోతే కాళ్ళకి చెప్పుల్లేకపోవడం ఏవిటి? యదార్థ పరిస్థితి నాకు చెప్పండి" అన్నారు శాస్త్రి.

"చెప్పు కొనుటకేమున్నది? ఏమీ లేదు" అని చమత్కరించి, చిరునవ్వు నవ్వి, వేళ్ళ మధ్య వెలుగుతూన్న సిగరెట్టు ఒక్కమారు పీల్చి ముందుకి అడుగేశారు శ్రీశ్రీ.

—పోలాప్రగడ